

టన్ను చీనీ రూ.15 వేలు
అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.15 వేలు, కనిష్టంగా రూ.4 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



కిలో టమాట రూ.34
అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.34, కనిష్టంగా రూ.20 ప్రకారం ధర పలికింది.

గరిష్ఠం/కనిష్ఠం
34.1°/21.6°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 15 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

గురుకులాల్లో మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం మిగులు సీట్లకు స్పాట్ అడ్మిషన్లు చేపట్టనున్నట్లు అంబేడ్కర్ గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయ అధికారి కె.జయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. 2024–25 విద్యా సంవత్సరంలో రెగ్యులర్ లేదా సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. బాలికలకు ఉరవకొండ కళాశాలలో ఎంఈసీ గ్రూపులో ఎస్సీ–18, ఎస్టీ–2, ఓసీ–1, సీఈసీలో ఎస్సీ–1, ఎస్టీ–1, ఓసీ–1, బ్రహ్మసముద్రం కళాశాలలో హెచ్ఈసీలో ఎస్సీ–9, ఎస్టీ–1, ఓసీ–1, సీఈసీలో ఎస్సీ–6, నల్లమాడ కళాశాలలో సీఈసీలో ఎస్సీ–39, ఎస్టీ–3, ఓసీ–1, బాలురకు సంబంధించి కణేకల్లు కళాశాలలో బైపీసీలో బీసీ–2, ఎస్సీ–1, కాళసముద్రం కళాశాలలో ఎంపీసీలో ఎస్టీ–1, బైపీసీ గ్రూపులో బీసీ–2, ఎస్సీ–2 సీట్లు ఖాళీలున్నాయని వెల్లడించారు. ఆసక్తిగల విద్యార్థులు నేరుగా సర్టిఫికెట్లతో ఆయా కళాశాలలకు వెళ్లి అడ్మిషన్లు పొందవచ్చన్నారు. అలాగే పప్పూరులోని బాలుర ఐఐటీ, నీట్ కళాశాలలో బైపీసీ గ్రూపులో ఎస్సీ–2 సీట్లు ఖాళీలున్నాయన్నారు. పదో తరగతిలో రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాల్లో 400కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు మాత్రమే అర్హులని స్పష్టం చేశారు.

ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు ‘అహుడా’ అనుమతి తప్పనిసరి



ఇన్‌చార్జి కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: అహుడా పరిధిలో ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు కచ్చితంగా అనుమతి పొందాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ స్పష్టం చేశారు. అహుడా పరిధిలో వీలైనంత ఎక్కువగా భూ బ్యాంక్ గుర్తించాలని చెప్పారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో అహుడా ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. అనంతపురం, మడకశిర, కళ్యాణదుర్గం, గుత్తి, పుట్టపర్తి, హిందూపురం, పెనుకొండ తదితర ప్రాంతాల్లో అహుడా చేపట్టిన పనులు, వాటి పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అహుడా పరిధిలో ప్లాట్ల క్రమబద్ధీకరణ చేసుకోని వారికి నోటీసులు జారీ చేయాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారితో సమన్వయం చేసుకుని ఈ ప్రక్రియ నిర్వహించాలని ఆదేశించారు. నగర, పట్టణ కేంద్రాల్లో నివాసయోగ్యమైన ప్రాంతాలకు దగ్గరగా భూములను ఎంపిక చేయాలని చెప్పారు. భూ సేకరణ క్రమంలో పెండింగ్ పనులను సత్వరం పూర్తి చేయాలని సూచించారు.లే అవుట్లలో మౌలిక సదుపాయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకుని పనులను వేగవంతం చేయాలని చెప్పారు.

న్యాయం చేయకపోతే ఆత్మహత్యనే శరణ్యం



అవగాహన కల్పిస్తున్న ఎస్పీ వీ రత్న

కదిరి అర్బన్: తన కుమారుడితో పాటు మరో బాలుడిపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే తమకు ఆత్మహత్యనే శరణ్యమని కాళసముద్రం సర్పంచు లలితమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. వివరాల్లోకెళితే.. మండల పరిధిలోని కాళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గంజాయి బ్యాచ్ వ్యవహారం సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. గంజాయి మత్తులో ఇద్దరు మైనర్లపై మరో ముగ్గురు మైనర్లు దాడి చేశారు. ఈ నేపథ్యంలో గురువారం కాళసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పౌరహక్కులపై గ్రామస్తులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎస్పీ వీ రత్న హాజరయ్యారు. తమ పిల్లలపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సర్పంచ్ లలితమ్మతో పాటు గ్రామానికి చెందిన పలువురు ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. మైనర్ విద్యార్థులపై దాడి చేసిన వారికి చట్టపరంగా శిక్షపడేలా చేస్తామని డీఎస్పీ శివనారాయణస్వామి హామీ ఇచ్చారు. అనంతరం పౌర హక్కులపై ఎస్పీ రత్న ప్రజలకు అవగాహన కల్పించారు.

కమాండ్ కంట్రోల్ రూం ప్రారంభం

కదిరి టౌన్: శాంతిభద్రత పరిరక్షణలో సీసీ కెమెరాలు క్రియాశీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ రత్న తెలిపారు. కదిరి పట్టణంలో రూ.43 లక్షల వ్యయంతో నిర్మించిన కమాండ్ కంట్రోల్ రూమ్ మహిళా రక్షణ విభాగం, పట్టణ వాసులు స్వచ్ఛందంగా వితరణ చేసిన సీసీ కెమెరాల ప్రారంభోత్సవంలో ఎస్పీ రత్న, కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ పాల్గొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళల భద్రత కోసం మహిళా రక్షణ విభాగాన్ని ఏర్పాటు చేసి ఒక మహిళా ఎస్ఐని కూడా నియమించామన్నారు. మహిళలు, చిన్నారులపై జరిగే నేరాల నియంత్రణకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

కొత్త కార్డులు.. కళ్లకు కాయలు

కొత్త రేషన్ కార్డు మంజూరు కావడం లేదు. కార్డులోకి పేరు చేర్చమంటున్నా పట్టించుకోవడం లేదు. కార్డుకు సంబంధించి ఆధార్ సీడింగ్ కరెక్షన్, తొలగింపు తదితర ప్రక్రియలనూ అటకెక్కించారు. కూటమి సర్కారు నిర్లక్ష్య ధోరణితో జిల్లాలో పేద ప్రజలు విసిగిపోతున్నారు. రేషన్ సరుకుల్లో కోత మినహా కొత్త కార్డుల గురించి పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



రేషన్ సరుకుల కోసం వేచి ఉన్న లబ్ధిదారులు (ఫైల్)

- అటకెక్కిన రేషన్ కార్డుల మంజూరు
- పట్టించుకోని కూటమి సర్కారు
- రేషన్ కార్డుకు సంబంధించి దరఖాస్తులన్నీ బుట్టదాఖలు
- విసిగిపోతున్న పేద ప్రజలు
- ఇంకెప్పుడు మంజూరు చేస్తారంటూ మండిపాటు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: పేద ప్రజలు కొత్త రేషన్ కార్డుల కోసం కళ్లకు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నా ఫలితం కానరావడం లేదు. దరఖాస్తుదారులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగి తిరిగి వేసారిపోతున్నారు. దరఖాస్తులు తీసుకున్నాం.. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే కార్డులు ఇస్తాం అంటూ ఏడాదిగా కాలం వెళ్లదీస్తుండడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లాల్లో 35 వేల మంది పైగా కొత్త కార్డుల కోసం దరఖాస్తులు అందజేశారు.

బుట్టదాఖలు..

కొన్ని కుటుంబాల్లో పెళ్లిళ్లు జరిగి ఉంటాయి. లేదా పిల్లలు పెద్దవాళ్లై ఉంటారు. అలాంటి వారి పేర్లు రేషన్ కార్డులోకి చేర్చాలి. కానీ అర్హులు ఏడాదిగా బతిమాలుతున్నా చేర్చడం లేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2.19 లక్షల మంది తమ పేరును రేషన్ కార్డులో చేర్చాలని దరఖాస్తు చేసుకున్నా ఇప్పటివరకూ అతీగతీ లేదు. దరఖాస్తులు చెత్తబుట్టల్లో వేశారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గతంలో ఎన్నడూ లేదు..

మృతి చెందిన వారి కార్డులు తొలగించి ఎప్పటికప్పుడు కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తారు. గత సర్కారు హయాంలో ఎప్పుడూ సంతృప్త స్థాయిలో ఎప్పటికప్పుడు ఇచ్చేవారు. గ్రామ/వార్డు సచివాలయాల నుంచి దరఖాస్తు చేసుకోగానే మంజూరు చేసేవారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాది నుంచి కొత్త రేషన్ కార్డుల ఊసే లేకుండా పోయింది. ఇందుకోసం వచ్చిన దరఖాస్తులు ఎక్కడున్నాయో కూడా తెలియడం లేదని బాధితులు వాపోతున్నారు. ఇక చిరునామాలు, పేర్లలో మార్పులకు అసలు దిక్కేలేదు.

రేషన్‌లో కోత మినహా..

రేషన్ సరుకుల్లో కోత మినహా కూటమి సర్కారు చేస్తున్నదేమీ లేదని లబ్ధిదారులు నిట్టూరుస్తున్నారు. గతంలో గోధుమలు ఇచ్చేవారు. చంద్రబాబు ప్రభుత్వంలో ఆరునెలలుగా వాటిని ఇవ్వడం లేదు. జొన్నలూ లేవు. వైఎస్సార్ సీపీ హయాంలో ఇంటి వద్దకే వెళ్లి రేషన్ సరుకులు పంపిణీ చేసేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. దీంతో 8 వేల మందికి పైగా వృద్ధులకు రేషన్ అందడం లేదు.

ఉమ్మడి అనంతపురం జిల్లాలో రేషన్ కార్డుల పరిస్థితి ఇలా

కేటగిరీ	దరఖాస్తులు
కొత్తగా చేరిక	2,19,877
కార్డు నుంచి తొలగింపు	25,672
ఆధార్ సీడింగ్	2,361
రైస్‌కార్డు నుంచి మార్పు	33,611
కొత్త రైస్ కార్డు	35,401
చిరునామా మార్పు	7,719

కార్డు కోసం ఎదురు చూస్తున్నాం



మా కుటుంబంలో నుంచి కొత్తగా రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకుని నెలలవుతోంది. ఇంత వరకూ కొత్త రేషన్ కార్డు మంజూరు కాలేదు. రేషన్ కార్డులు ఎప్పుడిస్తారో తెలీడం లేదు. రోజూ కార్యాలయాల చుట్టూ తిరిగినా అధికారులు పట్టించుకోవడం లేదు.
– రవికుమార్, దొమ్మరహట్టి, రొళ్ల మండలం

ఎప్పుడిస్తారో తెలీడం లేదు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 10 నెలల తర్వాత రేషన్‌కార్డులో సభ్యుల పేర్లు నమోదుకు దరఖాస్తులు తీసుకున్నారు. అయితే ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డుల ఊసేలేదు. సచివాలయంలో అడిగితే ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. దరఖాస్తులు తీసుకున్నారు సరే వస్తాయో రావో తెలీడం లేదు. – మంజమ్మ, అగళి

ఆప్షన్ ఇవ్వలేదంటున్నారు



నాకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇప్పటికీ మేమంతా మా తల్లిదండ్రుల రేషన్ కార్డులోనే ఉన్నాం. నా కుటుంబానికి హౌస్ హోల్డ్ మ్యాపింగ్ చేసి కొత్త రేషన్ కార్డు మంజూరు చేయాలని మా గ్రామ సచివాలయ అధికారులను కోరా. వారేమో ప్రభుత్వం ఆప్షన్ ఇవ్వలేదని చెబుతున్నారు.
– జయరాం, పడమటి కోడిపల్లి, బ్రహ్మసముద్రం మండలం

సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారిగా రెడ్డి బాలాజీ



కలెక్టర్‌కు పూల మొక్క అందిస్తున్న రెడ్డి బాలాజీ

పుట్టపర్తి టౌన్: సాంఘిక సంక్షేమశాఖ జిల్లా అధికారిగా రెడ్డి బాలాజీ బాధ్యతలు చేపట్టారు. గురువారం జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి శివరంగ ప్రసాద్ పదవీ విరమణ అనంతరం కదిరి అసిస్టెంట్ అధికారిగా పనిచే స్తున్న రెడ్డి బాలాజీకి సోషల్ వెల్ఫేర్ జిల్లా అధికారిగా బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ టీఎస్ చేతన్ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం బాధ్యతలు తీసుకున్న అనంతరం రెడ్డి బాలాజీ కలెక్టరేట్‌లో కలెక్టర్ టీఎస్ చేతన్‌ను మర్యాదపూర్వకంగా కలసి పూల మొక్కను అందించారు.

బదిలీ టీచర్లకు జీతాలు చెల్లించండి



డీఈఓ క్రిష్టప్పతో మాట్లాడుతున్న వైఎస్సార్‌టీఏ నాయకులు

పుట్టపర్తి: బదిలీలు పొందిన ఉపాధ్యాయులకు వెంటనే జీతాలు చెల్లించాలని వైఎస్సార్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్‌రెడ్డి డీఈఓ క్రిష్టప్పను కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో ఆయన జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డితో కలిసి డీఈఓను కలిసి జీతాల పెండింగ్ అంశంపై మాట్లాడారు. వారు మాట్లాడుతూ జూన్ నెలలో జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో చాలా మందికి జూన్, జూలై నెల జీతాలు అందలేదన్నారు. అలాగే వేసవి పది మూల్యాంకనం చేసిన వారికి అందాల్సిన పారితోషకం వెంటనే చెల్లించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాన్ని వివరిద్దాం



మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్, పార్టీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్

గోరంట్ల: కూటమి నాయకులు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను నిలువునా మోసం చేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ విమర్శించారు. వారి మోసాలను పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రతి గడపకూ వెళ్లి క్యూఆర్‌కోడ్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గురువారం మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మండల పరిధిలోని గడ్డం తండా, మందలపల్లి, కరావులపల్లి తండా, గంగంపల్లి, వెంకటరమణపల్లి , పులేరు గ్రామాల్లో నిర్వహించిన చంద్రబాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ పరిశ్రమలు తీసుకొచ్చేందుకు సీఎం చంద్రబాబు సింగపూర్ వెళ్లినట్లు , కూటమి ప్రభుత్వం ప్రచార ఆర్భాటం తప్ప పారిశ్రామిక వేత్తలు మాత్రం ముందుకు రాలేదన్నారు. కూటమి ప్రభుత్వ హయంలో కొత్త పరిశ్రమలు వచ్చే సంగతి పక్కనపెడితే అధికార పార్టీ నాయకుల అరాచకాల మూలంగా ఉన్న పరిశ్రమలు వెళ్లిపోయే పరిస్థితి నెలకొందన్నారు. కియా పరిశ్రమపై తమ్ముళ్లు చేసిన దౌర్జన్యకాండను కప్పి పుచ్చుకునేందుకు అధికార పార్టీ నాయకులు నీచ రాజకీయలు చేస్తున్నారన్నారు. మంత్రి సవిత గతంలో వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో గ్రామాల్లో మద్యానికి ప్రజలు బానిసలయ్యారని ఆరోపించారని, అయితే ఆమె భర్త వెంకటేశ్వరరావు గ్రామాల్లో మద్యం బెల్టుషాపులు ప్రారంభించడాన్ని ఏమనాలో అర్థం కావడం లేదన్నారు.నియోజకవర్గంలోని అన్ని కంకర మిషన్ల యాజమానులను సవిత, ఆమె అనుచరులు బెదిరించి ఇష్టారాజ్యంగా కంకర అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. మండల కన్వీనర్ వెంకటేష్, జెడ్పీటీసీ సభ్యుడు పాలేజయరాంనాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు రఘురామిరెడ్డి, ట్రెజరర్ బాలన్న గరిపల్లి రామకృష్ణారెడ్డి, టౌన్ కన్వీనర్ శంకర, మాజీ జిల్లా స్టీరింగ్ కమిటి సభ్యులు గంపల వెంకటరమణారెడ్డి, మండల మహిళా కన్వీనర్ కవిత పాల్గొన్నారు.

పింఛన్‌దారులకు ప్రతినెలా గండం

- విడతల వారీగా లబ్ధిదారులను ఏరివేస్తున్న కూటమి ప్రభుత్వం
- ఇప్పటికే పదివేలకు పైగా పింఛన్ల రద్దు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు



పింఛన్లు తొలగించడంతో కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న రామగిరి మండలం లబ్ధిదారులు (ఫైల్)

పుట్టపర్తి అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సామాజిక పింఛన్‌దారులకు ప్రతి నెలా గండం తప్పడం లేదు. ఎవరి పింఛన్ ఏ నెలలో ఎగిరిపోతుందోనని లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతి నెలలో కొందరు చొప్పున 14 నెలల కాలంలోనే చంద్రబాబు ప్రభుత్వం పదివేలకుపైగా పింఛన్లు కోత విధించింది. దీంతో బాధితులు రోడ్డున పడాల్సిన పరిస్థితులు దాపురించాయి.

10,817 పింఛన్లు కట్..

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత మొదటగా 2024 జూలైలో 2,70,973 పింఛన్‌దారులు ఉండేవారు. ఈ 14 నెలల కాలంలో ప్రతి నెలా విడతల వారీగా సుమారు 10,817 పింఛన్‌లను తొలగించారు. కొన్ని మండలాల్లో అధికారులపై ఒత్తిళ్లు తెచ్చి వేలాది పెన్షన్లు తొలగింపజేశారు. మరణించిన వారితో పాటు 10,817 పింఛన్లు పంపిణీకి నోచుకోలేదు. ఇప్పటికే రూ.15 వేలు, రూ.10 వేలు, వికలాంగుల పింఛన్లదారులను రకరకాల సర్వేల పేరుతో నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదించారు. ఇందులో కూడా అనర్హుల పేరుతో పింఛన్ తీసివేస్తారేమోనని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


50 ఏళ్లకే పింఛన్ల హామీ గాలికి..

కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారికి 50 ఏళ్లకే పింఛన్లు అంటూ వెనుకబడిన వర్గాల వారి నుంచి ఓట్లు కొల్లగొట్టింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు పూర్తవుతున్నా ఇప్పటి వరకూ ఇచ్చిన హామీని అమలు చేయలేక చేతులెత్తేసింది. దీంతో ఆయా వర్గాలకు చెందిన లక్షలాది మంది మోసపోయామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్లపై ప్రజాప్రతినిధులను నిలదీస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏడేళ్లు ప్రతి ఆరు నెలలకు ఒకసారి నూతన పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండేది. కులం, మతం, పార్టీ చూడకుండా సచివాలయ, వలంటర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దనే పింఛన్లను అందజేసేవారు. ప్రస్తుతం ఎవరికీ పింఛన్ ఇస్తారో.. ఎక్కడిస్తారో కూడా తెలీని పరిస్థితి నెలకొందని లబ్ధిదారులు వాపోతున్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ..

జిల్లాలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను శుక్రవారం నుంచి లబ్ధిదారులకు అందజేయడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. జిల్లాలో 2,64,665 మంది పింఛన్‌దారులకు రూ.115.68 కోట్లు విడుదల చేసినట్లు కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. ప్రతి నెలా అందజేసే 2,60,156 పింఛన్‌దారులతో పాటు అదనంగా ఈనెలలో వితంతు పింఛన్లు 4509 మంజూరైనట్లు పేర్కొన్నారు. ఏప్రిల్ 2019 నుంచి జూలై 2025 వరకూ కుటుంబ యజమాని పింఛన్ పొందుతూ మరణించినట్లయితే భార్యకు స్పౌజ్ కేటగిరి కింద కొత్తగా 4509 మందికి పింఛన్ మంజూరు చేసినట్లు తెలిపారు. వీరికి అదనంగా రూ.1.80 కోట్లు మంజూరు చేశామన్నారు. ఇదిలా ఉండగా.. వితంతు పెన్షన్లు అందజేస్తామని ప్రభుత్వం ఇప్పటికే నాలుగు సార్లు చెప్పి పంపిణీ చేయలేదు. ఈ నెల అయినా అందిస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.


ఐదుగురు వడ్డీ వ్యాపారుల అరెస్టు



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిటౌన్: ధర్మవరం పట్టణంలో అధిక వడ్డీల పేరుతో చేనేత కార్మికుడు రమణ, భారతి దంపతుల దాడి చేసిన కేసులో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రత్న తెలిపారు. గురువారం పోలీస్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో డీఎస్పీ శ్రీనివాసులు, ధర్మవరం టూటౌన్ సీఐ రెడ్డెప్పతో కలసి కేసు వివరాలను ఎస్పీ వివరించారు. జూలై 23న ధర్మవరంలోని శాంతినగర్‌లో నివాసం ఉంటున్న చేనేత కార్మికుడు రమణ, భారతి ఇంట్లోకి వడ్డీ వ్యాపారస్తులు చొరబడి దాడి చేయడంతో పాటు రూ.7 వేలు బలవంతంగా వసూలు చేశారన్నారు. స్థానికుల జోక్యంతో వడ్డీ వ్యాపారులు పరారైనట్లు పేర్కొన్నారు. ఇది సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బాధితుల ఫిర్యాదు మేరకు ధర్మవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారని వివరించారు. ఇన్‌చార్జ్ డిఎస్పీ నరసింగప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందాలు ఏర్పాటు చేసి ఏ1 ఎరుకల రాజా, ఏ2 మండల మహేష్, ఏ3 వినోద్‌కుమార్, ఏ4 గుజ్జల హేమంత్, ఏ5 గుంజర గోవర్ధన్, ఏ6 మహేష్, ఏ7 గుజ్జల విజయ్‌ని ముద్దాయిలుగా గుర్తించామన్నారు. గురువారం ఉదయం 9 గంటల సమయంలో ధర్మవరం సమీపంలోని కేతిరెడ్డి కాలనీ వద్ద ఐదుగురిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నారన్నారు. వారిపై గతంలో చాలా కేసులు ఉన్నాయన్నారు. రౌడీషీట్ కూడా ఓపెన్ చేశామని, త్వరలో అరెస్ట్ చేసి పీడీ యాక్ట్‌కూడా నమోదు చేస్తామన్నారు. అధిక వడ్డీలపై ఎవరైనా బాధితులు ఉంటే ముందుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న జేసీ అభిషేక్ కుమార్

ప్రశాంతి నిలయం: వయో వృద్ధులను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్ హెచ్చరించారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో విభిన్న ప్రతిభావంతులు , వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంరక్షణ చట్టం అమలుపై అధికారులతో సమావేశమయ్యారు. జేసీ మాట్లాడుతూ వయోవృద్ధుల సంరక్షణ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. చాలా కుటుంబాలలో వృద్ధులు నిర్లక్ష్యానికి గురి అవుతున్నారని, ఇలాంటి దుస్థితిని నివారించడానికే ఈ చట్టాన్ని రూపొందించారన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు సందేహాలను, వృద్ధులకు కావాల్సిన కనీస అవసరాలపై అధికారులకు ప్రతిపాదనలు చేశారు. కార్యక్రమంలో పుట్టపర్తి, ధర్మవరం ఆర్డీఓలు సువర్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పురం రైల్వేస్టేషన్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

- రైల్వే జీఎం ముకుల్ శరణ్ మాథుర్



రైల్వేస్టేషన్‌లో సదుపాయిలు పరిశీలిస్తున్న రైల్వే జీఎం, డీఆర్ఎం, తదితరులు

హిందూపురం: హిందూపురం రైల్వేస్టేషన్ అన్నిరకాలుగా అభివృద్ధి చేసి ఆదర్శ రైల్వేస్టేషన్‌గా తీర్చిదిద్దుతామని సౌత్ వెస్టన్ రైల్వే జనరల్ మేనేజర్ ముకుల్ శరణ్ మాథుర్ అన్నారు. గురువారం రైల్వే జీఎంతో పాటు బెంగళూరు డీఆర్ఎం అషియాతోష్ కుమార్ సింగ్, రైల్వే అధికారులు హిందూపురం డివిజన్‌లో తనిఖీలు నిర్వహించారు. ఇప్పటికే చేపట్టిన వివిధ అభివృద్ధి పనులతో పాటు ప్రయాణికుల వసతులు, సదుపాయాలు పరిశీలించారు. అలాగే ప్రయాణికుల వేచి ఉండే గది, ప్రయాణికుల భద్రత, ఇతర సదుపాయలపై ఆరా తీశారు.

ప్రయాణికుల భద్రతకే ప్రాధాన్యం..

రైల్వే జీఎం ముకుల్ శరణ్ మాథుర్ మాట్లాడుతూ రైలు ప్రయాణికుల భద్రతే తమకు ముఖ్యమని స్పష్టం చేశారు. హిందూపురం రైల్వేస్టేషన్ అమృత్ పథకం కింద ఎంపికైందన్నారు. సుమారు రూ.15 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామన్నారు. పురం రైల్వే స్టేషన్‌ను మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రయాణికులకు అవసరమైన లిఫ్ట్, ర్యాంప్, ఎక్సలేటర్ కూడా ఏర్పాటు చేయడానికి అవసరమైన చర్యలు చేపడతామన్నారు.

జీఎంకు వినతులు..

సింధనూరు ఎక్స్‌ప్రెస్ రైలును అనంతపురం వరకూ పొడిగించాలని పలువురు ప్రయాణికులు, విలేకరులు జీఎం దృష్టికి తీసుకెళ్లారు. అలాగే పుట్టపర్తి ప్యాసింజర్ రైలును అనంతపురం వరకూ పొడిగించాలని కోరారు. రద్దు చేసిన ధర్మవరం ప్యాసింజర్ రైలు పుట్టపర్తి వరకూ కొనసాగిస్తే ప్రయాణికులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. అనంతపురం ప్యాసింజర్ రైలులో ప్రయాణికులకు అవసరమైన మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జీఎం స్పందిస్తూ అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైల్వే సీనియర్ డీసీఎం నివేదిత, ఏడీఆర్ఎం పరీక్షిత్ మోహన్, సీనియర్ డీఈఎన్ రాజీవ్ శర్మ, సీనియర్ డీఓఎం ప్రియా, అధికారులు సోమప్ప, కిరణ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉచిత న్యాయ సహాయ సేవలు సద్వినియోగం చేసుకోండి



ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి వెంకటేశ్వర్లు

హిందూపురం: స్థానిక సబ్ జైలును సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు నాయక్ గురువారం తనిఖీ చేశారు. రిమాండ్ ఖైదీలతో మాట్లాడారు. ఏఏ కేసుల్లో నిందితులుగా ఎప్పటి నుంచి జైలులో ఉంటున్నారంటూ ఆరా తీశారు. సబ్‌జైలు నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఖైదీల కోసం తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు. బ్యారెక్‌లను పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించి, ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నవారికి ఉచిత న్యాయ సహాయం అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సబ్ జైలు అధికారి హనుమన్న, న్యాయవాది నవేరా, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి, పీఎల్‌వీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి కొలతల పరిశీలన

మడకశిర: పట్టణంలో ఇటీవల క్రయవిక్రయాలు సాగిన పలు ఇంటి కొలతలను జిల్లా రిజిస్ట్రార్ ప్రభావతి గురువారం పరిశీలించారు. పట్టణంలోని మారెమ్మగుడి వీధి, ఆది రెడ్డి పాళ్యం, వడ్రపాళ్యంలో మూడు నెలలుగా జరిగిన భూములు, భవనాల క్రయవిక్రయాలను వాటి విలువ మేరకు చేశారా? లేదా అని పరిశీలించారు. డాక్యుమెంట్లనూ తనిఖీ చేస్తూ ఇంటి కొలతలను తీయించారు. ఆమె వెంట స్థానిక సబ్ రిజిస్ట్రార్ నరసింహమూర్తి, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

ఉద్యోగ విరమణ రోజే మృతి

గుంతకల్లు రూరల్: వైద్య, ఆరోగ్య శాఖలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న వసుంధర గురువారం తన స్వగృహంలో మృతి చెందారు. గుంతకల్లు మండలం కసాపురం గ్రామానికి చెందిన ఆమె ప్రస్తుతం పత్తికొండ మండలం పుచ్చకాలమాడ పీహెచ్‌సీలో పనిచేస్తున్నారు. సర్వీసు పూర్తి కావడంతో గురువారం ఆమె ఉద్యోగ విరమణ పొందాల్సి ఉంది. అయితే కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న వసుంధర.. ఇంట్లోనే ఉంటూ చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో గురువారం కర్నూలు జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, సిబ్బంది పరామర్శించి వెళ్లిన కొద్దిసేపటికే మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో కన్ను మూశారు.

ఆటో కింద పడి చిన్నారి మృతి



తనుజ (ఫైల్)

గార్లదిన్నె: ప్రమాదవశాత్తు ఆటో కింద పడి ఓ బాలిక మృతి చెందింది. పోలీసులు తెలిపిన మేరకు.. పెద్దవడుగూరు మండలం ఈరన్నపల్లికి చెందిన వెంకటనాయుడు కొంత కాలంగా గార్లదిన్నె మండలం కల్లూరు కొండ కింద కొట్టాలలో నివాసముంటున్నాడు. ఆయన కుమార్తె తనూజ (9) గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 4వ తరగతి చదువుతోంది. రోజూ ఆటోలో పాఠశాలకు వెళ్లి వచ్చేది. ఈ క్రమంలో గురువారం సాయంత్రం పాఠశాల నుంచి ఆటోలో వస్తుండగా ఇంటి సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చే మరో వాహనానికి దారి ఇచ్చే క్రమంలో ఆటోను డ్రైవర్ రివర్స్ చేశాడు. అయితే ఈ విషయం తెలియని తనూజ ఉన్నఫలంగా ఆటో దిగడంతో అదుపు తప్పి కిందపడింది. డ్రైవర్ గమనించే లోపు వాహనం బాలికపైకి దూసుకెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. స్థానికులు వెంటనే అదే ఆటోలో పామిడిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే బాలిక మృతిచెందినట్లు నిర్ధారించారు.

అయోమయం.. గందరగోళం

- అన్నదాత సుఖీభవ అమలుపై స్పష్టత లేమి
- ఈ నెల 2న మొదటి విడత అంటూ కూటమి సర్కార్ హామీ
- నేటికీ ఈ-కేవైసీ పూర్తి కాక ఇబ్బందులు



ఓడీసీ వద్ద సేద్యం చేస్తున్న రైతు

గత ప్రభుత్వంలో రైతు భరోసా రైతులు	2,75,331 మంది
ప్రస్తుతం అన్నదాత సుఖీభవ రైతులు	2,61,281 మంది
ఎన్‌పీసీఐలో పెండింగ్ ఖాతాలు	8,751 మంది
ఈ-కేవైసీ పూర్తి కాని రైతులు	3,058 మంది

పుట్టపర్తి అర్బన్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలు చేసిన రైతు భరోసా పథకాన్ని కాపీ కొట్టిన ప్రస్తుత సీఎం చంద్రబాబు.. పేరు మార్చి అన్నదాత సుఖీభవ అంటూ 14నెలలుగా పథకాన్ని అమలు చేయకుండా రైతుల పొట్టకొడుతూ వచ్చారు. ఈ అంశాన్ని ఎత్తి చూపుతూ సామాజిక మాధ్యమాల్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రచారం కావడంతో ఆగస్టు 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.7 వేలు రైతుల ఖాతాల్లోకి జమ చేస్తామని కూటమి ప్రభుత్వ పెద్దలు ప్రకటించారు. అయితే ఈ పథకం అమలులో కీలకమైన ఈ-కేవైసీ ప్రక్రియ జిల్లాలో ఇంకా అసంపూర్తిగానే ఉండిపోయింది. 2,61,281 మందికి ఈ-కేవైసీ పూర్తి అయినట్లు వ్యవసాయాధికారులు తెలుపుతుండగా మరో 3,058 మందివి పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో చాలా మంది రైతులు అందుబాటులో లేకపోవడంతో సుఖీభవ పథకం అమలులో అయోమయం నెలకొంది.

క్రియాశీలకంగా మారనున్న ఎన్‌పీసీఐ..

ఆధార్‌తో అనుసంధానమైన రైతు బ్యాంకు ఖాతాకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా జమ చేస్తూ వచ్చింది. జమ కాని రైతులు బ్యాంకులకు వెళ్లి అనుసంధానం చేయించి నగదు తీసుకునేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రతి రైతూ ఈ-కేవైసీ పూర్తి చేయించాలనే నిబంధన విధించింది. రైతు సేవా కేంద్రాల్లో వేలి ముద్ర వేయాలని ఆదేశించింది. రైతులు అందరూ అన్ని పనులు పూర్తి చేశారు. తీరా అన్నదాత సుఖీభవ నగదు జమ చేసే సమయంలో మరో మెలిక పెట్టింది. అన్నదాత సుఖీభవ లబ్ధిదారుల్లో అధికంగా జాతీయ పేమెంట్స్ కార్పొరేషన్ (ఎన్‌పీసీఐ) లో మ్యాపింగ్ చేయించుకోవాలంటూ ఆదేశాలు జారీ చేసింది. ఎన్‌పీసీఐకు అనుసంధానం కాని ఖాతాలకు నగదు జమ కాదని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) సుబ్బారావు పేర్కొన్నారు. దీంతో ఈ- కేవైసీ పూర్తి చేసుకున్న రైతులు మరోసారి బ్యాంకుల వద్దకు బారులు తీరుతున్నారు. వేలాది మంది రైతులు కొంత కాలంగా బ్యాంకుల్లో ఎలాంటి లావాదేవీలు జరపకుండా ఉండడంతో వీరిలో ఎంత మందికి డబ్బు జమ అవుతుందోననే గందరగోళం మొదలైంది. అంతే కాక సంబంధిత రైతుల వివరాలు వ్యవసాయశాఖ వద్ద లేకపోవడంతో ఇప్పటికిప్పుడు అనుసంధానం చేయించడం సాధ్యం కాక అన్నదాతలు ఇబ్బంది పడుతున్నారు.

ఇబ్బందుల్లో రైతు..

గతంలోనూ రైతు రుణమాఫీ ప్రకటించి ఎగ్గొట్టిన చంద్రబాబు.. తాజాగా అన్నదాత సుఖీభవ పథకాన్ని అటకెక్కించే ప్రయత్నం చేస్తున్నారంటూ రైతులు వాపోతున్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా లబ్ధిదారులు 2,75,331 మంది ఉండగా.. ఇందులో 14,050 మందిని తొలగిస్తూ మిగిలిన వారిని అన్నదాత సుఖీభవ పథకానికి లబ్ధిదారులుగా ఎంపిక చేశారు. కౌలు రైతులు, దేవదాయ శాఖ భూములు, అటవీ భూములు సాగు చేసుకుంటున్న రైతులకు ప్రభుత్వం మొండిచెయ్యి చూపిందనే ఆరోపణలున్నాయి. దీనికి తోడు ఎన్‌పీసీఐలో ఇన్‌యాక్టివ్‌లో ఉన్న 7,448, మ్యాపింగ్ కాని 1,303 కలిపి మొత్తం 8,751 మందికి పథకం లబ్ధి ప్రశ్నార్థకమైంది.

రాష్ట్రాన్ని అప్పుల మయం చేశారు

- చంద్రబాబు ఏడాది పాలనలో ప్రజల నెత్తిన రూ.1.70 లక్షల కోట్ల అప్పుల భారం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ధర్మవరం: కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే రూ.1.70 లక్షల కోట్ల అప్పుల భారాన్ని ప్రజల నెత్తిన సీఎం చంద్రబాబు మోపి, రాష్ట్రాన్ని అప్పుల మయం చేశారంటూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ధ్వజమెత్తారు. ధర్మవరంలో సీపీఐ రెండవ జిల్లా మహాసభలు గురువారం జరిగాయి. ఈ సందర్భంగా స్థానిక పీఆర్‌టీ సర్కిల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ రాష్ట్రాభివృద్ధి కోసం అప్పులు చేస్తే రాష్ట్రం మరో శ్రీలంక అవుతోందంటూ గగ్గోలు పెట్టిన చంద్రబాబు.. ప్రస్తుతం తాను చేస్తున్నదేమిటో చెప్పాలన్నారు. అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చిన తర్వాత తుంగలో తొక్కారన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో రూ.15,420 కోట్ల భారాన్ని సామాన్యులపై మోపడం దారుణమన్నారు. అదానీ కంపెనీతో లాలూచీ పడి స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేసి, రాబోవు 25 ఏళ్లలో రూ.లక్ష కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు కుట్ర పన్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో సంక్షేమం లేక కార్మికులు, మహిళలు, యువత, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాజధాని అమరావతి నిర్మాణం పేరుతో ఇప్పటికే రూ.31 వేల కోట్లు ఖర్చు పెట్టేందుకు యత్నిస్తున్నారని, మరో రూ.31 వేల కోట్లు అవసరమని మంత్రి నారాయణ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. రాజధాని అమరావతిలో 50 వేల ఎకరాల భూసేకరణ చేశారని, ఇంకా 40 వేల ఎకరాల భూమి కావాలని సీఎం చంద్రబాబు భూసేకరణకు చర్యల చేపట్టడం అనుమానాలకు తావిస్తోందన్నారు. చంద్రబాబు పాలనలో అధికారుల పోలీస్, రెవెన్యూ అధికారుల అవినీతి అడ్డూ అదుపు లేకుండా పోతోందన్నారు. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, నాయకులు జాన్సన్‌బాబు, కాటమయ్య, జింకా చలపతి, రాజారెడ్డి, వేమయ్యయాదవ్, ముసుగు మధు, తదితరులు పాల్గొన్నారు.

విలేకరిని జైలుకు పంపడం సరికాదు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అత్తార్ చాంద్‌బాషా, తదితరులు

కదిరి టౌన్: రాజకీయ కక్షతో తలుపుల సాక్షి విలేకరి రఘునాథరెడ్డిపై అక్రమ కేసు నమోదు చేయించి, జైలుకు పంపడం సరైన పద్ధతి కాదని కూటమి నాయకులకు మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు హితవు పలికారు. గురువారం అత్తార్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విలేకరి ఏ తప్పూ చేయకున్నా.. కేవలం సాక్షి పత్రికకు పనిచేస్తున్నాడనే అక్కసుతో అతనిపై అక్రమంగా కేసు నమోదు చేయించారన్నారు. విధి నిర్వహణలో భాగంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తలుపుల విలేకరి రఘునాథ్‌రెడ్డిపై హత్య కేసు నమోదు చేయడం దారుణమన్నారు. కూటమి ప్రభుత్వంలో అరాచకాలు పెరిగిపోయాయనేందుకు ఇదే నిదర్శనమన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రశ్నించే గొంతుకలను నొక్కేందుకు సాగుతున్న కుట్రలో భాగమేనన్నారు. నిష్పాక్షపాతంగా వ్యవహరించాల్సిన పోలీసులు సైతం కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గడం వ్యవస్థ దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. రఘునాథరెడ్డికి, ఆయన కుటుంబానికి పార్టీ తరఫున అండగా ఉంటామని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ లింగాల లోకేశ్వరరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వి.ప్రణీత్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు షేక్ బాబ్జాన్, నాయకులు రమేష్ యాదవ్, బాబా, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమల స్థాపనకు సహకారం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్



శోభయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో కేంద్ర ప్రభుత్వం సహకారంతో పరిశ్రమల స్థాపనకు సహకరించి, యువతకు విస్తృత ఉపాధి అవకాశాలు కల్పిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. బీజేపీ జిల్లా విస్తృత స్థాయి సమావేశం గురువారం పుట్టపర్తిలోని ఆర్‌వీజే కల్యాణ మంటపంలో జరిగింది. మాధవ్‌తో పాటు మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆదోని శాసనసభ్యుడు పార్థసారథి, పార్టీ ,జిల్లా అధ్యక్షుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,.. ఉమ్మడి జిల్లాలో పండ్ల తోటల పెంపకం విరివిగా సాగుతోందని, ఇందుకు సంబంధించి పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. ఐటీ పరంగా జిల్లాను అభివృద్ధి చేస్తామన్నారు. పుట్టపర్తి, లేపాక్షి, పెనుకొండ, గుత్తి ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్ర శివనారాయణ, ఉపాధ్యక్షుడు విష్ణు వర్ధన్‌రెడ్డి, నాయకులు చంద్రమౌళి, బాలకృష్ణయాదవ్, దళిత యువ మోర్చా అధ్యక్షుడు జి.దేవానంద్, యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్ట వంశీ, రమణమూర్తి, అమరదేవేంద్ర, హరికృష్ణ గౌడ్, సాకే ఓబులేసు, కొండమరాజు, కత్తి రాజారెడ్డి, జ్యోతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'సాక్షి' విలేకరిపై అక్రమ కేసును ఎత్తేయాలి



ఎస్‌ఐకి వినతిపత్రం అందిస్తున్న ఏపీయూడబ్ల్యూజే నాయకులు

గాండ్లపెంట: తలుపుల 'సాక్షి' విలేకరి రఘునాథ్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసును ఎత్తివేసి బేషరతుగా విడుదల చేయాలని ఎన్‌పీకుంట ఏపీయూడబ్ల్యూజే మండల కమిటీ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, సభ్యులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ వలీబాషాకు వినతిపత్రం అందించారు. విధి నిర్వహణలో భాగంగా విలేకరి బాధితులను పరామర్శించడం కూడా నేరమైందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే మండల ఉపాధ్యక్షుడు ఫయాజ్‌ఖాన్ కార్యదర్శి అబ్దుల్‌గని, గౌరవ సలహాదారులు నరసింహులు నాయుడు, కోలాబ్రహ్మయ్య, ప్రభాకర్, శ్రీరాములు పాల్గొన్నారు.

రాప్తాడులో రెచ్చిపోయిన దొంగలు

- రూ.5.65 లక్షల నగదు చోరీ
- ఏడున్నర తులాల బంగారు నగలూ అపహరణ

రాప్తాడు: మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో బుధవారం అర్ధరాత్రి భారీ చోరీ జరిగింది. స్థానిక వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ సమీపంలో బీసీ కాలనీలో నివాసముంటున్న బాధితుడు చిరుతల ఇటుకు నల్లప్ప తెలిపిన మేరకు.. రాప్తాడుకు చెందిన చిరుతల ఈశ్వరయ్య కుమారుడు గణేష్, అద్ర వెంకటేశులు కుమార్తె సరిత వివాహం ఈ నెల 30న రాప్తాడులోని లక్ష్మీపండమేటి వేంకటరమణస్వామి ఆలయంలో జరిగింది. వివాహానికి బంధువైన ఇటుకు నల్లప్ప, తన భార్య శ్రీదేవితో కలసి వెళ్లాడు. వధూవరులిద్దరూ రాప్తాడుకు చెందిన వారు కావడంతో ఇరువైపులా కుటుంబ సభ్యులు బుధవారం రాత్రి మెరిమణి నిర్వహించారు. ఆ సమయంలో ఇంటికి తాళం వేసి మెరవణిలో నల్లప్ప దంపతులు పాల్గొన్నారు. విషయాన్ని గుర్తించిన దుండగులు తలుపులు ధ్వంసం చేసి లోపలకు ప్రవేశించి బీరువాలోని ఏడున్నర తులం బరువున్న బంగారు నగలు, రూ.60వేల సొంత నగదు, ఇటుకుల పల్లయ్య స్వామి ఆలయానికి చెందిన రూ.85వేలు, మోటార్ మెకానిక్‌గా ఉన్న కుమారుడు శివయ్య బెంగళూరులో సామగ్రి కొనుగోలు చేసేందుకు ఇతరుల నుంచి అప్పుగా తెచ్చిన రూ.4.20 లక్షలను అపహరించారు. రాత్రి 11 గంటలకు మెరవణి పూర్తి కావడంతో 12 గంటలకు ఇంటికెళ్లిన దంపతులు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో సీఐ శ్రీహర్ష, సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీంను రంగంలో దించి నిందితుల వేలిముద్రలను సేకరించారు. ఘటనపై పోలీసుల విచారణ కొనసాగుతోంది.

ఏపీఎస్‌ఏపీఈ రాష్ట్ర అధ్యక్షుడిగా కూరపాటి



కూరపాటి నరసింహారెడ్డిని అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఏపీఎస్‌ఏపీఈ) రాష్ట్ర అధ్యక్షుడిగా శింగనమల మండలం పెరవలిలోని జెడ్పీహెచ్‌ఎస్ పీడీ కూరపాటి నరసింహారెడ్డి ఎన్నికయ్యారు. గురువారం విజయవాడలో ఏపీఎస్‌ఏపీఈ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కమిటీ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను జిల్లా నాయకులు కేశవమూర్తి, ప్రభాకర్, గోపాలరెడ్డి, రాజశేఖర్, లక్ష్మీనారాయణ, ఆంజనేయులు, శ్రీనివాసులు తదితరులు అభినందించారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

చెన్నేకొత్తపల్లి: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన మేరకు.. అనంతపురం జిల్లా బుక్కరాయసముద్రం మండలం పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన నాగలింగారెడ్డి (57) చెన్నేకొత్తపల్లి మండలం యర్రంపల్లిలో గురువారం జరిగిన అల్లుడి కర్మకాండలో పాల్గొనేందుకు భార్య సుధారాణితో కలసి వచ్చాడు. ఈ క్రమంలో కర్మ కాండలు పూర్తయిన తర్వాత కాలకృత్యాలు తీర్చుకుని వస్తానంటూ భార్యతో చెప్పి గ్రామ సమీపంలోని పట్టాలు దాటుతుండగా వేగంగా దూసుకొచ్చిన రైలు ఢీకొంది. ప్రమాదంలో శరీరం ఛిద్రమై ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న హిందూపురం జీఆర్పీ ఎస్‌ఐ సజ్జప్ప అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి ..

హిందూపురం: కదులుతున్న రైలు నుంచి ప్రమాదవశాత్తు జారి పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి (65) మృతి చెందాడు. గురువారం హిందూపురం-దేవరపల్లి రైల్వేస్టేషన్ మధ్య కిరికెర పారిశ్రామిక వాడ వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. ముస్లిం అయి ఉంటాడనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆన్ డ్యూటీ రైల్వే ట్రాక్ మ్యాన్ గుర్తించి సమాచారం ఇవ్వడంతో రైల్వే పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

విద్యుదాఘాతంతో..



మృతుడు వెంకటేష్

ముదిగుబ్బ: మండలంలోని ఇందుకూరు గ్రామానికి చెందిన వెంకటేష్ (40) విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఆయనకు భార్య, పిల్లలు లేరు. బుధవారం గొర్రెల మేపునకు వెళ్లిన ఆయన రాత్రి పొలంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగలడంతో షాక్‌కు గురై మృతిచెందాడు. ఘటనపై సీఐ శివరాముడు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఖతార్‌లో తనకల్లు వాసి అనుమానాస్పద మృతి



నూరుల్లా (ఫైల్)

తనకల్లు: మండల కేంద్రానికి చెందిన నూరుల్లా (35) ఖతార్ దేశంలో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మూడేళ్ల క్రితం ఖతార్‌కు వెళ్లి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. గురువారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు సమాచారం అందడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆయనకు భార్య, ఇద్దరు చిన్నారులున్నారు.

ఎల్లోటిలో చోరీ

మడకశిర రూరల్: మండలంలోని ఎల్లోటి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు.. బుధవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుండగులు తాళం బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలోని రూ.1.50 లక్షల నగదు, నాలుగు గ్రాముల బంగారు కమ్మలు అపహరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో అనుమానితులు

నల్లమాడ: గ్రామాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న వారిని తండా వాసులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన గురువారం నల్లమాడ మండలంలో చోటు చేసుకొంది. వివరాలు.. ఎద్దులవాండ్లపల్లి తండా పరిసరాల్లో గురువారం కొత్త వ్యక్తులు సంచరిస్తుండటాన్ని తండా వాసులు గమనించారు. వారిలో ఒకరు పంట పొలాల్లో తచ్చాడుతుండటంతో అనుమానం వచ్చి ఇద్దరిని పట్టుకున్నారు. ఆ సమయంలో వారు పొంతన లేని సమాధానాలు చెబుతూ కొంత దూరంలో కారు ఆపుకుని ఉన్న మరో ఇద్దరికి సైగలు చేయడం గమనించారు. అప్రమత్తమైన యువకులు ద్విచక్ర వాహనాల్లో కారు వద్దకు చేరుకుని అక్కడున్న మరో ఇద్దరినీ పట్టుకుని సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని అనుమానితులను అదుపులోకి తీసుకుని ఓడీచెరువు పీఎస్‌కు తరలించారు. కాగా, మరో ఇద్దరు పరారయ్యారు. అదుపులో ఉన్న వారిని సీఐ నరేంద్రరెడ్డి విచారణ చేస్తున్నారు.

'జేఎన్‌టీయూ' ఫలితాలు విడుదల

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. బీటెక్ నాల్గో సంవత్సరం రెండో సెమిస్టర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ, ఎంబీఏ రెండో సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్/సప్లి, ఎంబీఏ ఒకటో సెమిస్టర్ (ఆర్-21) సప్లి, ఎంసీఏ రెండో సెమిస్టర్ (ఆర్-21) రెగ్యులర్/సప్లి, ఎంసీఏ ఒకటో సెమిస్టర్ (ఆర్-21) సప్లిమెంటరీ, ఫార్మా డీ నాల్గో సంవత్సరం రెండో సెమిస్టర్ (ఆర్-17) రెగ్యులర్/సప్లి ఫలితాలను గురువారం డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ నాగప్రసాద్ నాయుడు విడుదల చేశారు. ఫలితాల కోసం వర్సిటీ వెబ్‌సైట్ చూడాలని కోరారు.

ఆటోల పరస్పర ఢీ - గాయపడిన కార్మికులు

పరిగి: ఆటోలు పరస్పరం ఢీకొన్న ఘటనలో గార్మెంట్స్ పరిశ్రమలో పనిచేస్తున్న మహిళా కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. పరిగిలోని ఓ గార్మెంట్స్‌లో పనిచేస్తున్న పలువురు మహిళలు గురువారం విధులు ముగించుకుని స్వగ్రామం కోనాపురానికి ఆటోలో బయలుదేరారు. మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలోకి చేరుకోగానే ఎదురుగా కాలువపల్లిలోని గార్మెంట్స్ నుంచి మహిళా కార్మికులను ఆటోలో కర్ణాటక ప్రాంతంలోని గౌడేటి ప్రాంతానికి తరలిస్తున్న ఆటో ఢీకొంది. ఘటనలో రెండు ఆటోల్లోని జయమ్మ, రామాంజమ్మ, బాలకృష్ణ, ప్రసాద్, సుగుణ, నాగమణి, నాగరత్న, చరణ్ తదితరులు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఒకరిద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. స్థానికులు సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను హిందూపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అది ప్రమాదం కాదు.. హత్యే

- వ్యక్తి హత్య కేసులో వీడిన మిస్టరీ
- భార్యనే సూత్రధారి
- కుమారుడు, అక్క కుమారుడితో కలసి కుట్ర
- నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

గార్లదిన్నె: గత నెల కారు ఢీకొని రైతు మృతి చెందిన కేసులో మిస్టరీని పోలీసులు ఛేదించారు. అది ప్రమాదం కాదని, పథకం ప్రకారం కుటుంబసభ్యులే హత్య చేసి ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసినట్లు నిర్ధారించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. గార్లదిన్నె పీఎస్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను డీఎస్పీ వెంకటేశులు వెల్లడించారు. గార్లదిన్నె మండలం జంబులదిన్నె గ్రామానికి చెందిన బోయ నల్లప్ప (50)కు 30 ఏళ్ల క్రితం శింగనమల మండలం కల్లుమడి గ్రామానికి చెందిన లక్ష్మితో వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. 25 ఏళ్ల క్రితం బతుకు తెరువు కోసం నల్లప్ప తెలంగాణలోని వికారాబాద్ జిల్లా తాండూరు మండలం మల్రెడ్డిపల్లి సమీపంలో ఉన్న క్వారీలో పని చేసేందుకు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ పని చేస్తున్న ఓ మహిళతో సన్నిత సంబంధాలు ఏర్పడ్డాయి. ఆర్థిక సాయం అందిస్తూ ఆమెతో వివాహేతర సంబంధం కొనసాగిస్తూ వచ్చాడు. ఈ విషయం తెలిసి భార్య సర్దిచెప్పేందుకు ప్రయత్నించింది. అయితే భార్యకు విడాకులు ఇచ్చేందుకైనా సిద్ధమని, ఆ మహిళను మాత్రం తాను వీడి ఉండలేనని నల్లప్ప స్పష్టం చేయడంతో మనస్పర్థలు చెలరేగి ఇద్దరూ విడిపోయారు. ప్రస్తుతం లక్ష్మి తన పిల్లలతో కలసి కల్లూరు నివాసముంటోంది. నల్లప్ప అనంతపురం సమీపంలోని సోములదొడ్డిలో ఒంటరిగా ఉంటూ రోజూ ద్విచక్ర వాహనంపై ఓబులాపురం వద్ద ఉన్న తోటకు వచ్చి వెళ్లేవాడు. అప్పుడప్పుడు తెలంగాణలో ఉంటున్న మహిళ వద్దకెళ్లి వచ్చేవాడు. ఈ క్రమంలో ఆస్తి కూడా ఆమె పేరునే రాసిస్తాడనే అనుమానాలు వ్యక్తం కావడంతో భార్య లక్ష్మి ఆందోళనకు గురైంది. దీంతో పిల్లలకు ఆస్తి దక్కాలనే ఆలోచనతో ఎలాగైనా భర్తను హతమార్చాలని నిర్ణయించుకున్న ఆమె... తన కుమారుడు ఆశ్రయ్, పెద్దవడుగూరు మండలం చిత్రచేడులో ఉంటున్న అక్క కుమారుడు శ్రీకాంత్ కలసి నల్లప్ప హత్యకు పథకం రచించారు. పథకంలో భాగంగా జూలై 23న నల్లప్ప ద్విచక్ర వాహనంపై వ్యవసాయ తోట వద్ద నుంచి తిరిగి వస్తుండగా జంబులదిన్నె కొట్టాల సమీపంలోకి చేరుకోగానే వెనుక నుంచి ఇన్నోవా కారుతో ఢీకొని హతమార్చారు. హత్యకు ఉపయోగించిన కారును అద్దెకు తీసుకున్నట్లుగా పోలీసుల దర్యాప్తులో గుర్తించారు. అయితే తొలుత ప్రమాదంలో రైతు మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా భార్య, కుమారుడిని విచారణ చేయడంతో అసలు నిజం వెలుగు చూసింది. దీంతో లక్ష్మి, ఆమె కుమారుడు ఆశ్రయ్, అక్క కుమారుడు శ్రీకాంత్‌ని గురువారం అరెస్ట్ చేసి, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సీఐ కౌలట్లయ్య, ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా, సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.